నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- గ్రామాలకు దూరంగా ఏర్పాటు
- లక్షలాది రూపాయలు వృథా
- దిష్టిబొమ్మలా గేట్లు, బోర్డులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులు



హస్నాపూర్ సమీపంలో ఏర్పాటుచేసిన తాటికొండ గ్రామీణ క్రీడా ప్రాంగణం

భూత్పూర్: గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు బీఆర్‌ఎస్ హయాంలో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక గ్రామీణ క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయి. దాదాపు రూ. 2లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఒక్కో క్రీడా ప్రాంగణం కోసం ఖర్చు చేశారు. యువతకు జిమ్ కోసం పైపులు, ఖోఖో, వాలీబాల్ ఆడటం కోసం ఇనుప పైప్‌లైను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం అవి తుప్పుపట్టాయి. ఈ క్రీడా ప్రాంగణాలు గ్రామానికి కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. మండలంలోని తాటికొండ క్రీడాప్రాంగణం హస్నాపూర్ శివారులోని ఓ వెంచర్‌లో ఏర్పాటుచేయగా, పాతమొల్గర క్రీడాప్రాంగణం చౌలతండా సమీపంలో నెలకొల్పారు. ప్రతి గ్రామంలోనూ దూరంగా ఏర్పాటు చేయడంతో పాటు గ్రామస్తులకు, యువతకు అందుబాటులో లేక నిరుపయోగంగా మారాయి. పలుచోట్ల నేటికీ చదును చేయకపోవడంతో ఏపుగా మొక్కలు పెరిగాయి. లక్షలు ఖర్చు చేసి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా వాటిని ఉపయోగంలోకి తీసుకురావడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బోర్డులు, గేట్లు ఏర్పాటు చేయడంతో దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. గ్రామీణ క్రీడా ప్రాంగణాలు చదును చేసి, క్రీడా పరికరాలను అందుబాటులో తీసుకురావాలని గ్రామీణ యువత కోరుతున్నారు.

క్లుప్తంగా

క్రీడాకారుడికి సన్మానం



మహబూబ్‌నగర్ క్రీడలు: కేరళ రాష్ట్రం తిరువనంతపూర్‌లో ఈనెల 11నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి యోగా పోటీలకు జిల్లా కేంద్రానికి సీనియర్ యోగా క్రీడాకారుడు కోటకదిర వెంకటేశ్ ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో వెంకటేశ్‌ను ఆదివారం ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పి.వెంకటేశ్ అభినందించి శాలువాతో సత్కరించారు. జాతీయస్థాయి యోగా పోటీల్లో పతకం సాధించి జిల్లాక పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహేష్, ఎస్.వెంకటేశ్ పాల్గొన్నారు.

అవోపా మండలాధ్యక్షుడిగా శ్రీనివాసులు



దేవరకద్ర రూరల్: ఆర్యవైశ్యుల సంఘానికి సంబంధించిన కమిటీ ఎన్నికల్లో భాగంగా అవోపా మండలాధ్యక్షుడిగా పొద్దుటూరు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడిగా కొండ శ్రీనివాసులును నియమించినట్లు అవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, జిల్లా అధ్యక్షుడు పాపిశెట్టి మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం వారికి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఓఎస్డీ వేముల శ్రీనివాస్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత, నరేష్, హరికాంత్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తుందని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ కార్యాలయంలో వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి జెండా ఎగరవేసి, ప్రతిజ్ఞ చేసి మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బుచ్చారెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి మాజీ ఉపసర్పంచ్

మరికల్: మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ సీమ శివకుమార్ ఆదివారం బీజేపీలో చేరారు. ఈసందర్భంగా ఎంపీ డీకే అరుణ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భజరంగ్‌దళ్ అధ్యక్షులు రవి, రఘులు సైతం బీజేపీలో చేరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని బలోపేతం చేసి అధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ఎంపీ ధీమా వ్యక్తం చేశారు.

'దత్తత తీసుకొని దగా చేశావు'



కోస్గి రూరల్: వెనుకబడిన కొడంగల్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని కేటీఆర్ దగా చేశావని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేటీఆర్ కొడంగల్‌ను పదేళ్లు దత్తత తీసుకొని అభివృద్ధి చేసిందేమి లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికి రూ.5000కోట్ల నిధులను కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటే కేటీఆర్ చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ తీసుకొచ్చి కొడంగల్‌లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తుడుం శ్రీనివాస్, ఇద్రిస్, గిరిధర్‌రెడ్డి, భానునాయక్, నాగులపల్లి నర్సింహ, మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లేష్, తదితరులున్నారు.

సూర్యనమస్కార పోటీల్లో వనజారెడ్డికి ప్రథమస్థానం



మహబూబ్‌నగర్ క్రీడలు: సిద్దిపేట పట్టణంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి సూర్యనమస్కార పోటీల్లో జిల్లాకు చెందిన వనజారెడ్డి మెరుగైన ప్రతిభ కనబరిచారు. 25 ఏళ్లపైబడిన విభాగంలో ఆమె ప్రథమ స్థానంలో నిలిచారు. వనజారెడ్డి ఇటు పోలీస్ క్రీడలతో పాటు అటు యోగా పోటీల్లో ప్రతిభ చాటుతూ పతకాలు సాధిస్తున్నారు.

సంతలో అన్నదానం



నవాబుపేట: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం జరిగే సంతకు వచ్చే జనాల కోసం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి సంతకు వచ్చే వారి కోసం 23వారాలుగా ఉచిత భోజనం అందిస్తున్నారు. ఈ కార్యక్రమం పట్ల మండల ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. వ్యాపార సంఘం మండలాధ్యక్షుడు సుధాకర్‌చారి, పుట్టి ఆంజనేయులు, రఘువీర్‌శర్మ, నిరంజన్, నసీర్, రఘు, చందు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.1.50లక్షల విరాళం



జడ్చర్ల: స్థానిక కావేరమ్మపేట పరిధిలో గల శ్రీ బంగారు మైసమ్మ దేవాలయ అభివృద్ధికి బీఆర్‌ఎస్ నాయకుడు చించోడు అభిమన్యురెడ్డి రూ.1.50లక్షల విరాళాన్ని అందజేశారు. ఆదివారం ఇందుకు సంబంధించిన చెక్కును కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి ఆలయ కమిటీకి ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహేశ్, నాయకులు కృష్ణారెడ్డి, లింగం, మహేశ్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు నరేందర్, చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

భక్తులను సురక్షితంగా గుట్టపైకి తీసుకెళ్లాలి

మహబూబ్‌నగర్ రూరల్: పేదల తిరుపతిగా భావించే మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి జాతరకు వచ్చే భక్తులను సురక్షితంగా గుట్టపైకి తీసుకెళ్లే బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ అన్నారు. ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం, అనుబంధ సంఘం మన్యంకొండ స్టేజి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ముద్రించిన కార్డులను ఆటోకార్మికులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఘాట్‌రోడ్ మీద జాగ్రత్తగా ఆటోలు నడపాలని అన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రయాణం కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, ఆటో యూనియన్ నాయకులు వెంకట్రాములు, సాయిలు, రామకృష్ణ, హీర్యానాయక్, లక్ష్మణ్, రవిబాబు, శ్రీనివాసులు, మల్లేష్, చిన్న కుర్మయ్య పాల్గొన్నారు.



కనీస పెన్షన్‌పై పార్లమెంట్‌లో ప్రస్తావించాలని వినతి


ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్ల సంఘర్షణ సమితి నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ఈపీఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్ పెంపుదల కోసం పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించాలని ఈపీఎస్ పెన్షనర్ల జాతీయ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎ.రాజసింహుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో డీకే అరుణకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పీఎఫ్ నుంచి వచ్చే కనీస పెన్షన్ రూ.1000 ఉందని, దీనిని డీఏతో రూ.7500కు పెంచాలని, పెన్షనర్ల భార్య, భర్తకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలనే తదితర డిమాండ్లతో అనేక ఏళ్లుగా కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు భగవంతు, నాగాంజనేయులు, మనోహర్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ బాటలో నడవాలి

మహబూబ్‌నగర్ రూరల్: సంత్ సేవాలాల్ మహారాజ్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఈనెల 15న సేవాలాల్ 286వ జయంతిని పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన శోభాయాత్ర ర్యాలీ వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గిరిజనుల్లో నిరక్షరాస్యత, పేదరికం, అనాగరికతను పారదోలేందుకు సేవాలాల్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన చేసిన బోధనలు ఎంతో మందిని ప్రభావితం చేసి సన్మార్గంలో నడిపించాయన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రఘునాయక్, ప్రధాన కార్యదర్శి ఛత్రపతి, ఉపాధ్యక్షులు వెంకీ, విజయ్, రాజేష్‌నాయక్, హరి తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ


ప్రత్యేక అలంకరణలో మైసమ్మ అమ్మవారు


మైసమ్మ ఆలయం వద్ద భక్తులు

నవాబుపేట: మండలంలో ప్రసిద్ధి చెందిన పర్వాతాపూర్ మైసమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. మొక్కులు చెల్లించుకొని నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా అడవిలో సందడి వాతావరణం కనిపించింది.

'డబుల్'లో కనీస సౌకర్యాలు కరువు


జానంపేటలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- సీసీ రోడ్లు లేక అవస్థలు
- ప్రహరీలేక కాలనీకి విషసర్పాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద కనీస సౌకర్యాలు కరువయ్యాయి. సీసీ రోడ్లు లేక ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. గ్రామానికి దూరంగా పెద్దచెరువుకు సమీపంలో గత ప్రభుత్వ హయాంలో జీప్లస్ వన్ పద్ధతిన 80 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు. వాటిని లబ్ధిదారులకు కేటాయించడంతో చాలామంది అక్కడ నివాసం ఉంటున్నారు. సీసీ రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో ఇళ్ల ముందు బురద ఏర్పడటంతో కింది భాగంలో నివసించే వారు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లకు సమీపంలోనే చెరువు ఉండటం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విషసర్పాలు కాలనీలోకి వస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, కరెంటు సరఫరా బాగానే ఉందని, రోడ్లు, ప్రహరీ లేక అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలను తీర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలి



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద సీసీ రోడ్లు నిర్మించాలి. వర్షాకాలంలో సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రహరీ లేక పలు సమస్యలతో సతమతమవుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. – జహంగీర్, జానంపేట.

నవాబుపేట మార్కెట్‌కు పోటెత్తిన వేరుశనగ



నవాబుపేట: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుకు ఆదివారం వేరుశనగ పోటెత్తింది. మొత్తం 8,652 బస్తాల వేరుశనగ వచ్చిందని మార్కెట్ కార్యదర్శి రమేష్ తెలిపారు. క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,489, కనిష్టంగా రూ. 5,849 ధర పలికింది. కాగా రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా గిట్టుబాటు ధర కల్పించాలని, తూకాల విషయంలో నిర్లక్ష్యం చేసి రైతులను ఇబ్బందులు పెట్టరాదని మార్కెట్ చైర్మన్ లింగం మార్కెట్ అధికారులను ఆదేశించారు. రైతులు ఇబ్బందులు కలిగితే వెంటనే వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే మన్యంకొండ అభివృద్ధి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్‌ఎస్ హయాంలో మన్యంకొండలో అన్నివిధాలుగా అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం దివిటిపల్లిలో మహబూబ్‌నగర్ రూరల్ మండల పార్టీ ఆధ్వర్యంలో మన్యంకొండ జాతర ఉత్సవాలకు చెందిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కొండ మీదకు పోయేందుకు నాలుగు లైన్ల రహదారికి ప్రణాళికలు వేసినట్లు తెలిపారు. అతిథిగృహం, ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం కల్యాణ మండపం, జాతరకు వచ్చే భక్తుల కోసం పూర్తివసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, నాయకులు ఆంజనేయులు, కేసీ నర్సింహులు, పార్టీ మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, వెంకటస్వామి, రామ్‌లక్ష్మణ్, నవకాంత్, గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

దివిటిపల్లిలోని కేసీఆర్ నగర్‌లో డబుల్ బెడ్‌రూం ప్రాంగణంలో నిర్మించిన జిట్ట ఆంజనేయస్వామి విగ్రహం, నవగ్రహ ధ్వజస్తంభం, పోచమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి
- మహమ్మదాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభం


ఎంపీడీఓ కార్యాలయం వద్ద నాయకులు, అధికారులతో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని పరిగి ఎమ్మెల్యే డా.టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంతో పాటు మగంపేటతండా బీటీరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. నూతన మండలాలకు భవనాలను ఏర్పాటు చేసేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక నిధులతో సీసీ రోడ్లు, అండర్ డ్రెయినేజీలు, గిరిజనతండాలకు బీటీ రోడ్లు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గండేడ్ ఎంపీడీఓ దేవన్న, మహమ్మదాబాద్ ఇన్‌చార్జి ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ, డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాంలాల్, శాంతిబాయి, రాఘవేందర్‌రెడ్డి, ముకుందం విష్ణు, మోహన్, పాల్గుణ, భరత్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చలో కోస్గి'ని విజయవంతం చేయాలి

మహమ్మదాబాద్: రైతు సమస్యలపై పోరాటం చేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు చలో కోస్గి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు భిక్షపతి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోస్గి మండలంలో కేటీఆర్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టే ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

భూత్పూర్: మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అపార్ కార్డు కోసం పాఠశాల యాజమాన్యం ఆధార్ కార్డుల్లో పేరు, పుట్టిన తేది తదితర వాటిని సరి చేసుకోవడానికి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా కేంద్రంలోని ఆధార్ సెంటర్లలో టోకెన్ సిస్టం ఉంటే ఆధార్‌కార్డు అప్‌డేట్ చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. భూత్పూర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఆధార్ సెంటర్ భూత్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చేతి పంపు ప్రారంభం



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలోని కట్టమీద ఎల్లమ్మ దేవాలయం వద్ద ఆదివారం చేతిపంపును గ్రామస్తులు ప్రారంభించారు. ఎల్లమ్మ ఉత్సవాల సమయంలో ఇక్కడ నీటి ఎద్దడి సమస్య ఉండటంతో గ్రామస్తులంతా కలిసి బోరు వేయించారు. ఆలయం దగ్గర నీటి సమస్య తీరడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీరప్ప స్వామి ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరు



అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామంలో జరుగుతున్న బీరప్ప స్వామి ఉత్సవాలకు ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పూలగంపలకు నమస్కరించారు. గ్రామదేవతకు కొబ్బరికాయ కొట్టారు. అదేవిధంగా ఎల్లమ్మ దేవరకు హాజరయ్యారు. గొంగడితో ఎమ్మెల్యేను సన్మానించిన కుర్వ యాదవులు గొర్రె పిల్లను బహూకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, నాయకులు కొండా జగదీశ్వర్, యాట సుధాకర్, సత్యనారాయణ, గుజ్జుల నాగన్న, మాల వెంకటయ్య, సుండు నర్సింహులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, అండర్ డ్రెయినేజీ పనులు ప్రారంభం



భూత్పూర్: మండలంలోని భట్టుపల్లిలో సీసీ రోడ్లు, అండర్ డ్రెయినేజీ పనులకు రూ.7 లక్షలు మంజూరు కాగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కాలనీకి రూ.3లక్షల వ్యయంతో అండర్ డ్రెయినేజీలు, రూ.4 లక్షలతో సీసీ రోడ్లు పనులు చేపడుతున్నారు. గత పదేళ్లలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చొరవతో గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ డ్రెయినేజీ నిర్మాణాలు చేపడుతున్నట్లు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, సీనియర్ నాయకులు రఘుపతి రెడ్డి తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం కొకుంట్ల మండల కేంద్రంలోని 1994–95 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకొని తాము చదువుకున్న పాఠశాలలో జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా ఎవరెవరూ ఏ రంగాల్లో స్థిరపడ్డారో ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు.